ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024



పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్‌గా జగదీష్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ విశాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్‌ల శాఖ సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ నియమితులయ్యారు. పర్యాటక అభివృద్ధి సంస్థకు సంబంధించి ఆరు జిల్లాల్లో కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించనున్నారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖకు సంబంధించి ఏడీగా ప్రభుత్వం కొత్తవారిని నియమించాల్సి వుంది.

గాడిన పడుతున్న ప్రగతి రథచక్రం



- ఆర్టీసీపై కూటమి ప్రభుత్వం దృష్టి
- కొత్త బస్సుల కొనుగోలు
- విజయనగరానికి 14 కేటాయింపు
- వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యం

● జిల్లాలోని ప్రతి పల్లెలో ప్రగతి రథచక్రం పరుగులు తీయాలి. ఆర్టీసీని బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం. ప్రయాణికుల సుఖమయమైన ప్రయాణానికి, క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకునేలా బస్సులను కండీషన్లలో ఉంచుతున్నాం. ప్రభుత్వం ఏర్పడి 6 నెలల కాకముందే జిల్లాకు 14 కొత్తబస్సులు కొన్నాం. సిబ్బంది కొరతను కూడా తీరుస్తాం. వీటివల్ల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు సమయానికి గమ్యస్థానం చేరుకుంటారు.

-ఈ నెల 20న ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

● గత ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి ఉద్యోగులకు లేనిపోని మభ్యపెట్టింది. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేసింది. కనీసం ఈ ఐదేళ్లలో కొత్త బస్సుల ఊసులేదు. అందుకే కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ప్రజల అవసరాలకు అంచనా వేసి 1000 బస్సుల కొనుగోలు చేస్తున్నాం. సామాన్యుడికి మెరుగైన రవాణా సేవలు అందించడమే లక్ష్యం. విజయనగరం రీజియన్‌కు 14 కొత్త బస్సులను ఏర్పాటు చేసింది కూటమి ప్రభుత్వం. మున్ముందు మరిన్ని కొత్త బస్సులు అందుబాటులోకి రానున్నాయి.

-బస్సుల ప్రారంభోత్సవంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విజయనగరం డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి)

ఇప్పుడిప్పుడే ఆర్టీసీకి కొత్త ఊపిరి వస్తోంది. కొత్త బస్సులు సమకూరుతున్నాయి. అదే సమయంలో రహదారులు సైతం మెరుగుపడుతున్నాయి. మున్ముందు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చేలా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆర్టీసీ అస్తవ్యస్తంగా మారింది. పేరుకే ప్రభుత్వంలో విలీనం తప్ప.. ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నెపంతో ఆర్టీసీ స్థలాలపై ప్రభుత్వం పెత్తనం ఎక్కువైంది. విలీనం చేశామన్న పేరుతో ఉద్యోగులకు కార్పొరేషన్ హయాంలో ఇచ్చిన రాయితీలకు కత్తెర వేసింది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో విజయనగరం, ఎస్.కోటలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. 166 వరకూ బస్సులు నడుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కొత్త బస్సు అన్న మాట లేకపోయింది. దీంతో కాలం చెల్లిన బస్సులతో సిబ్బంది పడిన బాధలు వర్ణనాతీతం. చాలా బస్సుల్లో పగిలిన అద్దాలు, చిరిగిన సీట్లే దర్శనమిచ్చేవి. బస్సు లోపల కూర్చొని ప్రయాణిస్తే రణగొల ధ్వనులతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. కొన్ని బస్సులకు స్టార్టింగ్ ట్రబుల్. దీంతో వాటిని ఆన్‌లోనే ఉంచాల్సిన పరిస్థితి. ఫలితంగా డీజిల్ అదనంగా ఖర్చవుతోంది. 15 వరకూ డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెకానిక్‌లు సైతం అరకొరగా ఉన్నారు. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయడం లేదు. 40 శాతం కాంట్రాక్ట్ సిబ్బందితోనే నడిపిస్తున్నట్టు ఆర్టీసీ యూనియన్ నేతలు చెబుతున్నారు. డిపోల్లో నిపుణులైన మెకానిక్‌లు లేకపోవడం, విడి పరికరాలు సక్రమంగా సరఫరా కాకపోవడంతో బస్సుల మరమ్మతులకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్సులు డిపోల్లోకి చేరుకున్న తరువాత లోపాలను లాగ్ రిజిస్టర్‌లో నమోదుచేయాలి. వాటిని రాత్రికి మెకానిక్‌లు సరిచేస్తారు. కానీ, సిబ్బంది తక్కువ కావడంతో ఈ విధానం సక్రమంగా అమలుకావడం లేదని తెలుస్తుంది. ఈ ప్రభావం బస్సుల కండీషన్‌పై పడుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీలో కొత్త నియామకాలు లేకుండా పోయాయి. అడపాదడపా అప్రంటీస్ మేళాలో కొద్దిమందిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించుకొని చేతులు దులుపుకొన్నారు. ఒక్కో బస్సుకు డ్రైవర్, కండక్టర్, గ్యారేజీ మెకానిక్, సహాయకుడు కలుపుకొని నలుగురు సిబ్బంది ఉండాలి. కానీ, బస్సుల నిష్పత్తి చూసుకుంటే ఇద్దరు కూడా ఉండని పరిస్థితి. సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై భారం పడుతోంది. 8 గంటల పాటు డ్యూటీ చేయాల్సి ఉండగా 12 గంటలకు మించి చేయాల్సి వస్తోంది. దీంతో విధుల్లో సిబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా కొత్తగా వెయ్యి బస్సులను కొనుగోలు చేసింది. ఇందులో 14 బస్సులను విజయనగరం రీజియన్‌కు కేటాయించింది. సిబ్బంది కొరతను అధిగమించేందుకు త్వరలో కొత్త నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుంది.

15 ఏళ్లు దాటిన బస్సులు లేవు..

ప్రతిరోజూ విజయనగరం డిపో నుంచి 48 వేల కిలో మీటర్లు, ఎస్.కోట డిపో నుంచి 17 వేల కిలో మీటరు మేర బస్సులు ప్రయాణం చేస్తాయి. 15 ఏళ్ల దాటిన బస్సులు ఈ రెండు డిపోల్లో లేవు. ఈ మధ్యనే కొన్ని బస్సులను నిలిపివేశాం. సిబ్బంది కొరత లేకుండా ఉండేందుకు కాంట్రాక్టు పద్ధతిలో మెకానిక్‌లు, డ్రైవర్లను తీసుకున్నాం.

-శ్రీనివాస్, ఆర్టీసీ డిపో మేనేజర్, విజయనగరం



ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రులు రాంప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు (ఫైల్)



ముక్కాం తీరంలో..

ముందుకొచ్చిన సముద్రం

భోగాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం, చేపల కంచేరు తీరంలో ఆదివారం సముద్రం 60 నుంచి 70 అడుగుల ముందుకు వచ్చింది. అలలు ఉధృతంగా తీరాన్ని తాకుతున్నాయి. అల్పపీడనం కారణంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా తీరానికే పరిమితమయ్యారు. అప్పుడప్పుడు ఈ విధంగా సముద్రం ముందుకొస్తుంటుందని, కొన్ని గంటలు, రోజుల పాటు ఉండి మరలా యథాస్థానానికి వెళ్లిపోతుంటుందని మత్స్యకారులు చెబుతున్నారు.



అపరాలకు అపార నష్టం

- నీట మునిగిన పంట పొలాలు
- లబోదిబోమంటున్న రైతులు

8లో

పర్యాటకానికి మంచి రోజులు

- 29న తాటిపూడిలో బోటు షికారు పునఃప్రారంభం
- ట్రయల్ రన్ నిర్వహణ
- పెరగనున్న సందర్శకుల తాకిడి

గంట్యాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి పర్యాటక కేంద్రానికి మంచి రోజులు వచ్చాయి. రిజర్వాయర్‌లో బోటు షికారు పునఃప్రారంభంకానుంది. ఈ నెల 29న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బోటు షికారును ప్రారంభించనున్నారు. ఇప్పటికే విజయవాడ నుంచి తాటిపూడికి బోట్లు, ఫైబర్ జట్టీలు తెప్పించారు. ఇందులో రెండు మోటార్ బోట్లు, నాలుగు పెడల్ బోట్లు, నాలుగు క్యక్ష బోట్లు ఉన్నాయి. ఆదివారం ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో రిజర్వాయర్‌లో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. బోటు షికారు ప్రారంభమైతే తాటిపూడి రిజర్వాయర్ సందర్శకులతో కళకళలాడనుంది.

2018లో ఆగిన బోటు షికారు..

తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారును 2000 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ మంగపతిరావు ప్రారంభించారు. దీనికోసం పెద్ద బోట్లు రెండు, స్కూటర్, రోయింగ్, పెడల్‌బోట్లు రెండు చొప్పున ఏర్పాటు చేశారు. గోస్తానీ సరోవర్ విహర్ పేరిట మొత్తం 8 బోట్లను తాటిపూడి గ్రామానికి చెందిన వ్యక్తులు నడిపేవారు. ఈక్రమంలో ఏకో టూరిజం సంస్థ తాటిపూడి రిజర్వాయర్‌పై దృషిసారించింది. బోటు షికారు కోసం మరో రెండు పెద్ద బోట్లు ఏర్పాటు చేసింది. వీటిని గిరిజనలు నడిపేవారు. అలాగే, రిజర్వాయర్ ఆవల ఏకో టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కాటేజీలు నిర్మాణం, గిరి వినాయక విగ్రహం, క్యాంటీన్ సదుపాయం వంటివి కల్పించారు. బోటు షికారు అనంతరం సందర్శకులు కాటేజీలకు వెళ్లి విశ్రాంతి తీసుకునేవారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో ఉపాధి పొందుతూ జీవనం సాగించేవారు. మరోవైపు రిజర్వాయర్ ఆవల ఉన్న గిరిజనులు సైతం వారి గ్రామాలకు బోట్ల ద్వారా వెళ్లేవారు. బోటు షికారు కోసం ప్రతి రోజూ అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చేవారు. సెలవు దినాలతోపాటు, కార్తీక మాసంలో వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు. అయితే, 2018లో కృష్ణా నదిలో బోటు ప్రమాదం జరగడంతో అప్పటి నుంచి తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారును నిలిపివేశారు.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

గత వైసీపీ ప్రభుత్వంలో తాటిపూడి రిజర్వాయర్ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. బోటు షికారు ప్రారంభానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పర్యాటక అభివృద్ధికి ఒక్కరూపాయి కూడా విదల్చలేదు. దీంతో ఐదేళ్లు తాటిపూడి బోసి పోయింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పర్యాటక కేంద్రాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టారు. తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారు పునఃప్రారంభం కోసం రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులతో చర్చించారు. దీంతో జలవనరుల శాఖ బోటు షికారుకు అనుమతిచ్చింది. ఇటీవల ఈ రిజర్వాయర్‌ను, గిరి వినాయక కొండను కలెక్టర్‌తో పాటు వీఎంఆర్‌డీ కమిషనర్ పరిశీలించారు. అలాగే ఐహెచ్‌సీఎల్ గ్రూపు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ నానడే కూడా తాటిపూడిని సందర్శించారు. కాటేజీల వరకూ రోప్ బ్రిడ్జి నిర్మాణం, అక్కడ ఉన్న పది ఎకరాల స్థలంలో కేఫ్ టేరియా, బర్డ్ పార్కు, కన్వెన్షన్ హాల్, ఎంపీ థియేటర్ సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదించాలని కలెక్టర్, పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన స్థలాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. మరికొద్ది రోజుల్లో తాటిపూడి పర్యాటక ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి.



తాటిపూడి రిజర్వాయర్‌లో సిద్ధం చేసిన బోట్లు

బోటు షికారు ట్రయల్ రన్

అర్జీలకు మోక్షం

- శాఖల వారీగా మండల స్థాయి ఉద్యోగులకు శిక్షణ
- ఎస్.కోట, విజయనగరం మండలాల ఎంపిక
- అర్జీదారులను సంతృప్తి పరిచేందుకు ప్రభుత్వం చర్యలు



విశాఖపట్నంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మండల స్థాయి అధికారులు (ఫైల్)

● ఎక్కడో డిల్లిలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏపీలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కారం బాగోలేదని చెప్పారు. కానీ, అధికారులు మాత్రం అద్భుతంగా పరిష్కరిస్తున్నామని తప్పుడు లెక్కలతో ప్రజెంటేషన్‌లు ఇచ్చారు. లేని సంతృప్తి స్థాయిలను సృష్టించి, ప్రభుత్వ కళ్లకు గంతలు కట్టాలని ప్రయత్నించారు. ఇలాయితే ప్రజల్లో మాపై నమ్మకం సడలిపోదా.?

-ఇటీవల అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

శృంగవరపుకోట డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి)

ఈ వాఖ్యలతో ప్రభుత్వ అధికారులు మేల్కొన్నారు. నిజంగా సంతృప్తి స్థాయిలను పెంచే ప్రయత్నం చేస్తోన్నారు. ప్రజలు అందించే అర్జీలను నిర్దిష్టకాలంలో పరిష్కరించేందుకు శాఖల వారీగా శిక్షణ ఇచ్చే పనిలో పడ్డారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అత్యధికంగా అర్జీలు వస్తున్న శృంగవరపుకోట, విజయనగరం మండలాలను ఎంపిక చేశారు. అర్జీల పరిష్కారంలోనూ ఈ రెండు మండలాలు వెనుకబడి ఉన్నాయి. దీంతో ఈ మండలాలకు చెందిన రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, వ్యవసాయం, పశుసంవర్ధక, ఫిషరీస్, సర్వశిక్షఅభియాన్, విద్యాశాఖ, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, స్త్రీశిశు సంక్షేమశాఖ, డీఆర్‌డీఏ, జలవనరుల శాఖ, జిల్లా పరిషత్, మెడికల్ అండ్ హెల్త్, గృహ నిర్మాణ శాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, రవాణా, విద్యుత్ వంటి 29 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులకు ఈ నెల 20న విశాఖపట్నంలోని ఏపీహెచ్‌ఆర్‌డీఐలో అవగాహన కల్పించారు. అధికారులకు అందిన ప్రతి వినతిని జావాబుదారితనంతో ఎలా పరిష్కరించాలో ఇక్కడ వివరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారానికి ఉన్న అడ్డంకులను అర్థమయ్యే రీతిలో ఎలా చెప్పాలో అవగాహన కల్పించారు. ఇతర శాఖలకు వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు పంపించాలే తప్ప, బుట్టదాఖలు చేయకూడదని దిశనిర్దేశం చేశారు. అర్జీదారుని చిరునామా, ఫోన్ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని చెప్పారు. సమస్య పరిష్కారంతో కలిగిన సంతృప్తి, పరిష్కారం చేయలేకపోతే దానికి గల కారణాలు, వాటిని అధిగమించే సూచనలను ఇవ్వడం ద్వారా కలిగిన అర్జీదారుల సంతృప్తిని నమోదు చేయాలని శిక్షణలో పేర్కొన్నారు. ఇలా ప్రభుత్వంలో సంతృప్తి స్థాయిలను పెంచేందుకు ఇప్పుడు అడుగులు పడుతున్నాయి.

అధికారుల్లో పట్టుదల..

గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం పేరుతో దరఖాస్తులు స్వీకరించేది. వీటికి పరిష్కారం చూపడం అటుంచి, తిరిగి సమస్యలను సృష్టించేది. దీంతో ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు పడ్డారు. జగన్ సర్కారు మాదిరిగా కాకుండా ప్రజల వినతులకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం చూపాలని కూటమి ప్రభుత్వం భావించి మీ కోసం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. కలెక్టర్, ఎస్పీ, నియోజకవర్గ, మండల స్థాయి కార్యాలయాలతో పాటు పార్టీ కార్యాలయాల్లోనూ మీ కోసం కార్యక్రమం నిర్వహించేవారు. సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడంతో పాటు తప్పనిసరిగా వారి ఆధార్, ఫోన్ నెంబర్ దరఖాస్తుపై నమోదు చేసేలా చర్యలు తీసుకునేవారు. అంతే, అప్పటినుంచి కుప్పలు తెప్పలుగా సమస్యల పరిష్కారానికి వినతులు వచ్చిపడుతున్నాయి. ఈ ఫిర్యాదులను ప్రభుత్వం ఆశించిన స్థాయిలో అధికారులు పరిష్కరించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కానీ, పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. ప్రజల సంతృప్తి స్థాయి చాలా ఎక్కువ ఉందని ప్రభుత్వం వద్ద నమ్మబలుకుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన సీఎం చంద్రబాబునాయుడు ప్రధాన మంత్రి మోదీ చెప్పిన విషయాన్ని కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించారు. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. నిజంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మండల స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల వరకు శిక్షణలు ఇవ్వడం ద్వారా కూటమి ప్రభుత్వం ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా సమస్యలను పరిష్కరించాలన్న పట్టుదల జిల్లా అధికారుల్లో ప్రస్తుతం కనిపిస్తుంది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- డ్రంకెన్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించాలి
- హెల్మెట్ ధరించని వారిపై కేసులు
- ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నియంత్రణకు భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. పెద్ద ప్రమాదాలు జరిగినప్పటికీ, స్వల్ప గాయాలతో ఎలా ప్రాణాలతో సురక్షితంగా బయట పడవచ్చునో? వివరించాలన్నారు. ఊహించని రహదారి ప్రమాదాల నుంచి రక్షించే రక్షణ రేఖ వంటిది హెల్మెట్ ధారణ అని అన్నారు. ప్రతి రోజు డిజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, వాహన తనిఖీలు చేపట్టి ప్రజలు, వాహనదారులకు రహదారి భద్రత, మోటారు వాహన చట్టం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, వారిపై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది హెల్మెట్ ధరించని 35,204 మందిపై ఎంవీ చలానాలు విధించినట్లు తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

ఎస్‌బీఐలో 13,735 క్లర్క్ జాబ్స్



- హైదరాబాద్ సర్కిల్: 342
- అమరావతి సర్కిల్: 50
- చివరి తేదీ: 2025 జనవరి 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు.
- పూర్తి వివరాల కోసం: sbi.co.in/web/careers/current-openings వెబ్‌సైట్ చూడవచ్చు.

భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఖాళీలు ఇవి.
హైదరాబాద్ సర్కిల్: 342, అమరావతి సర్కిల్: 50

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హతలు: ఏ విభాగంలో అయిన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తునకు అర్హులు. అలాగే ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంల్లో ఈ కేంద్రాలున్నాయి.

ప్రిలిమినరీ/ మెయిన్స్: ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ ఏప్రిల్‌లో జరుగుతుంది.

ఎంపిక: ఈ పరీక్షలను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష: ప్రశ్న పత్రం మొత్తం వంద మార్కులకు ఉంటుంది. జవాబులను 60 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక్కో విభాగానికి కేటాయించిన నిర్ణీత వ్యవధిలోనే సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇందులో నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా జవాబు రాసిన ప్రతీ ప్రశ్నకు 1/4 మార్కును కట్ చేస్తారు. సుమారుగా ప్రతీ ఖాళీకి పదిమంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమి.

మెయిన్ పరీక్ష: ఇందులో 200 మార్కులకు 190 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 40 నిమిషాల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా సమాధానం రాసిన ప్రతీ ప్రశ్నకు పావు మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50 ప్రశ్నలు	50 మార్కులు	35 నిమిషాలు
ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ &	50 ప్రశ్నలు	50 మార్కులు	45 నిమిషాలు
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు	60 మార్కులు	45 నిమిషాలు
మొత్తం	190	200	2 గం. 40 నిమి.

ప్రిపరేషన్ టిప్స్

జనరల్
- ప్రిపరేషన్ ప్రారంభించే ముందే సిలబస్, వెయిటేజీ పట్ల అవగాహన తెచ్చుకోవాలి. వెయిటేజ్ ఆధారంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- ఎక్కువ సిలబస్ ఉన్న దృష్ట్యా సరైన ప్రణాళికను తయారు చేసుకోవాలి. వెయిటేజీ, కష్టాన్ని బట్టి ఆయా టాపిక్‌కు సమయాన్ని కేటాయించుకోవాలి.
- నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తయినప్పటికీ పునశ్చరణ అనేది క్రమం తప్పకుండాలి చేసుకోవాలి. దీంతో పరీక్షహాల్లో వేగంగా సమాధానాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.
- బ్యాంకింగ్ తదితర పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. నిర్ణీత సమయంలో జవాబు పూర్తయ్యేలా కృషిచేయాలి. ఒక ప్రశ్నకు ఎక్కువ సమయం పడుతుందనుకుంటే వెంటనే దానిని వదిలేసి ఇంకోదానికి వెళ్లిపోవాలి. చివర్లో టైమ్ మిగిలితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
- మాక్ టెస్టులు తప్పనిసరి. అభ్యర్థి బలాలు, బలహీనతలు దీనితో బయట పడతాయి. తప్పులు కనిష్ట స్థాయిలో ఉండే విధంగా అభ్యర్థులు సిద్ధం కాగలుగుతారు.

ఇంగ్లీషు
- ఇంగ్లిషు సిలబస్ ఇటీవల కాలంలో చాలా మారింది. అందుకే నిర్లక్ష్యం చేయొద్దు.
- రెనిన్ మార్టిన్ బుక్ నుంచి గ్రామర్ రూల్స్‌ను నేర్చుకోవాలి. ఉదాహరణల ఆధారంగా వాటిని నేర్చుకోవాలి.
- ఇంగ్లిషు ఆర్టికల్స్ రోజు చదవాలి. కొత్త పదాలు రాసుకోవాలి. తరచుగా పునశ్చరణ చేసుకోవాలి.
- క్లోజ్ టెస్ట్, పిల్లర్స్, సెంటెన్స్ కరెక్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ చాప్టర్లను ప్రాక్టీసు చేయాలి.

రీజనింగ్
- బేసిక్ కాన్సెప్టులు అర్థం అయితే ఈ సెక్షన్ సులువు.
- పరీక్షలో వచ్చే అవకాశం ఉన్న పజిల్ మోడల్స్ రోజు రెండు మూడు పూర్తి చేయాలి.
- ఇన్ ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, డైరెక్షన్ డిస్టెన్స్, రక్త సంబంధాలు చాప్టర్లు ప్రాక్టీసు చేయాలి.

క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్
- స్క్వేర్స్, క్యూబ్స్, టేబుల్స్ బట్టీపట్టాలి.
- పరీక్షలో కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదిక్ ట్రిక్స్ ప్రాక్టీసు చేయాలి.
- బేసిక్ చాప్టర్లు అయిన నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, యావరేజ్, రేషియో ప్రపోర్షన్స్, పర్సెంటేజీలు బాగా చూసుకోవాలి.
- బార్ గ్రాఫిక్స్ టాబులర్ డిఐ తదితర డేటా ఇంట్రప్రిటేషన్ సెట్స్ ప్రాక్టీసు ముఖ్యం.

కరెంట్ అఫైర్స్
- క్రమం తప్పకుండా పేపర్ చదవాలి. రెండు మూడు పత్రికల ఎడిటోరియల్ పేజీలు చూడాలి.
- సీఎస్ఆర్ జీకే పుస్తకాలు ఫాలోకావాలి.
- మనోరమ ఇయర్ బుక్ చదివితే మంచిది.

రిఫరెన్స్ పుస్తకాలు
- **క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్:** ఎస్ చాంద్, ఆర్.ఎస్. అగర్వాల్, అరుణ్ శర్మ, ఎంకె పాండే పుస్తకాలు చదవాలి.
- **ఇంగ్లీషు లాంగ్వేజ్:** రెనిన్ మార్టిన్, అరిహంత్ పబ్లికేషన్స్, ఎస్.చాంద్ పుస్తకాలు మంచివి
- **జనరల్ అవేర్‌నెస్:** మనోరమ ఇయర్ బుక్, సీఎస్ ఆర్ జీకే, దిన పత్రికలు
- **బ్యాంకింగ్ అవేర్‌నెస్:** అరిహంత్ పబ్లికేషన్స్

జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2025

అడ్మిషన్



దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ ప్రకటన వెలువడింది. 2025 మే 18న ఎంట్రెన్స్ నిర్వహించనున్నారు. ఫలితాలను జూన్ 2న ప్రకటిస్తారు. 2025 ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీల్లో 17,695 బీటెక్, బీఎస్(బ్యాచిలర్ ఆఫ్ సైన్స్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయడానికి అర్హులు. ఈ సంవత్సరం పరీక్షలను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తోంది.

కలికిరి సైనిక్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగాలు

జాబ్ కార్నర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలికిరిలోని సైనిక్ స్కూల్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం ఏడు ఉద్యోగాలు ఉన్నాయి. స్కూల్ మెడికల్ ఆఫీసర్-1, పీజీటీ(కంప్యూటర్/ మేథ్స్)-2, టీజీటీ(సోషల్ సైన్స్)-1, పీటీఐ కం మ్యాట్రన్-1, కౌన్సెలర్-1, హార్స్ రైడింగ్ ఇన్‌స్ట్రక్టర్-1 ఖాళీలు ఉన్నాయి. 2025 జనవరి 10వ తేదీలోపు దరఖాస్తు పోస్టులో పంపించాలి. పూర్తి వివరాల కోసం https://sskal.ac.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and post-graduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date: 31-12-2024 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date: 15-01-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

PROMYS India

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists) 2025 is offered by PROMYS, an Indian residential mathematics summer program, in partnership with the Indian Institute of Science (IISc.) to the students of classes 9 to 12.
Eligibility: Applicants must be at least 15 years old on May 11, 2025. They must be enrolled in classes 9 to 12 or pre-university courses in a government-funded, government-aided, private, unaided, independent school, sixth-form college, home schools, or other types of secondary and higher secondary schools.
Prizes & Rewards: Selected students will receive a full scholarship covering tuition fees and other benefits.
Last Date to Apply: 15-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PROM2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

రేవతి కుటుంబాన్ని పరామర్శించా



జగపతి బాబు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని తాను పరామర్శించానని, కానీ ప్రచారం చేసుకోలేదని నటుడు జగపతి బాబు అన్నారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ నుంచి ఎవరూ పరామర్శించలేదని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై జగపతి బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు. 'సినిమా షూటింగ్ పూర్తయ్యాక ఊరి నుంచి తిరిగి రాగానే వెంటనే ఆసుపత్రికి వెళ్లాను. బాధిత కుటుంబాన్ని పరామర్శించాను. శ్రీతేజ తండ్రి, సోదరిని పలకరించా. బాబు కోలుకుంటాడని ధైర్యం చెప్పా. కానీ ప్రచారం చేసుకోలేదు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు క్లారిటీ ఇవ్వాలని చెబుతున్నా' అని జగపతి బాబు ఆ వీడియోలో పేర్కొన్నారు.



రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

సుకుమార్

"రంగస్థలం'లో అద్భుతంగా నటించిన రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందనుకున్నా. కానీ రాలేదు. ఈసారి 'గేమ్ ఛేంజర్' క్లైమాక్స్‌లో రామ్‌చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు డైరెక్టర్ సుకుమార్. రామ్‌చరణ్ హీరోగా ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను డ్రీమ్స్ రాజేశ్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విదేశీ ప్రేక్షకులు తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. 'వన్ నేనొక్కడినే' చిత్రాలను ఇక్కడ ఆదరించి ఉండకపోతే నాకు తర్వాతి సినిమాలు వచ్చేవి కావు' అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' క్రికెట్‌కు సచిన్ ఎలాగో...ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. అలాంటి డైరెక్టర్‌తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఇది మా బేనర్‌లో 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. ఓ సాంగ్‌ను డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నామని తెలిసి నాకు సంతోషం వేసింది. రామ్‌చరణ్ వల్లే సినిమా ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ' ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుడి మధ్య వచ్చే ఘర్షణ మీదే ఈ చిత్రం ఉంటుంది. రామ్‌చరణ్ ఎంతో అద్భుతంగా నటించారు' అని అన్నారు.

కించపరిచే పోస్టులొద్దు

- అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి



సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు, మీ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయండి అని అల్లు అర్జున్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే నకిలీ అకౌంట్ల ద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలో అభిమానుల ముసుగులో కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అల్లు అర్జున్ అలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

మర్రిచెట్టు కింద



ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన, ముస్కాన్ రాజేందర్ హీరో, హీరోయిన్లుగా నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు' పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది. నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటులు పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిల్మ్‌చాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏఏ ప్రెసిడెంట్ రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ 'బేనర్, టైటిల్, డైరెక్టర్...ఇలా ఈ సినిమాకు అన్నీ పవర్‌ఫుల్‌గానే ఉన్నాయి' అని అన్నారు. చిత్ర దర్శకుడు నరేశ్ వర్మ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది' అని తెలిపారు.

బెనిఫిట్‌కు బ్రేక్?

'తెలంగాణలో ఇక నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలు పెంచబోం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ అనుమతినివ్వను. ఈ కుర్చీలో ఉన్నంతవరకూ మీ ఆటలు సాగనివ్వను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక టాలీవుడ్‌ను కలవరపరుస్తోంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కొత్త మలుపులు తీసుకుంటూ చిత్ర పరిశ్రమ మెడకు చుట్టుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమౌతోంది.


బెనిఫిట్ షోల రద్దు ప్రభావం వెంటనే తెలుగు చిత్ర పరిశ్రమపై కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సంక్రాంతికి విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు వసూళ్ల పరంగా భారీగా లబ్ధి చేకూరుతుండగా, ఇకపై దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది.

సంక్రాంతి చిత్రాలివే...

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. రూ. 450 కోట్ల భారీ బడ్జెట్‌తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం అన్ని రికార్డులను తిరగరాస్తుందనే అంచనాలు ఉన్నాయి. జనవరి 12న బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకూ మహారాజ్' విడుదలవుతోంది. జనవరి 14న వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదలవుతోంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు లేకపోతే ఈ సినిమాల వసూళ్లు దెబ్బతింటాయి. 'గేమ్ ఛేంజర్'తో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలను దిల్‌రాజు నిర్మించారు. ఆయనతో పాటు సినీ పెద్దలు ఇప్పటివరకూ ప్రభుత్వ నిర్ణయంపై స్పందించలేదు. ప్రభుత్వంతో ఏమైనా సంప్రదింపులు జరుపుతారా అనేది వేచి చూడాలి.

వసూళ్లలో కీలక పాత్ర

బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న స్టార్ హీరోల







సినిమాలకు ఎంతగానో అవసరం. భారీగా ఆరంభ వసూళ్లు తెచ్చుకోవడానికి.. సినిమా త్వరగా బ్రేక్ ఈవెన్ కావడానికి దోహదం చేస్తాయి. ఈ నెల 5న విడుదలైన 'పుష్ప 2' సినిమా తొలిరోజే ఏకంగా రూ.294 కోట్లు రాబట్టడంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కీలక పాత్ర పోషించాయి. అలాగే ముందురోజు పెయిడ్ ప్రీమియర్ షోలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా టికెట్ రేట్లు పన్నులతో కలిపి సింగిల్ స్క్రీన్స్‌లో రూ.1000.. మల్టీప్లెక్సుల్లో రూ.1200లు దాటిపోయాయి. అలాగే రిలీజైన 18 రోజుల వరకూ టికెట్ ధరను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది తెలంగాణ సర్కార్. 'పుష్ప 2'తో పాటు ఈ ఏడాది విడుదలైన 'దేవర', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు లభించడంతో మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకున్నాయి. అయితే, 'పుష్ప 2' ప్రీమియర్స్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం.. బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం, అసెంబ్లీలో ఈ ఘటన గురించి ప్రస్తావన రావడం.. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీని ప్రభావం రానున్న సినిమాలపై పడనుంది.

భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, కొన్ని రోజుల వరకూ టికెట్ ధరల పెంపు, అదనపు ఆటలకు వెసులుబాటు ఇవ్వాలని పరిశ్రమ కోరడం, ప్రభుత్వం అంగీకరించడం జరుగుతోంది. ఒకప్పుడు ఎన్ని సెంటర్లలో వంద రోజులు ఆడిందనేది సినిమా విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఫస్ట్ డే వసూళ్లు.. అడ్వాన్స్ బుకింగ్స్, వారాంతపు వసూళ్లు ప్రామాణికంగా మారాయి. అలా, విజయం కోసం కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఝలక్ ఇచ్చిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

పర్యవేక్షణ లేక.. ఇసుక దందా ఆగక

● ఇన్‌ఫిల్టర్ బావులకు పొంచి ఉన్న ప్రమాదం ● ఇదీ బొడ్డవలస నాగావళి నదీతీరంలో పరిస్థితి


బొడ్డవలస ఆవతలిఒడ్డులో యంత్రాలతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

రేగిడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలంలోని బొడ్డవలస నాగావళి నదీ తీరంలో ఇసుక తవ్వకాలపై పర్యవేక్షణ లేకపోవడంతో దందా ఆగడంలేదు. దీంతో ఇక్కడ ఇన్‌ఫిల్టర్ బావులకు ప్రమాదం పొంచిఉంది. ప్రధానంగా రేగిడి మండలంలోని బొడ్డవలస నాగావళి తీరం నుంచి ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అయితే అవతలి ఒడ్డున ఉన్న గోపాలపురం పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దులోఉంది. ఇక్కడే ఎక్కువగా ఇసుక తవ్వకాలు జరుగు తున్నాయి.ఈ ప్రాంతం ఇన్‌ఫిల్టర్ బావులకు 500 మీటర్లలోపు ఉండడంతో వేసవిలో నీటిలభ్యతపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన నెలకొంది.

ఇదీ పరిస్థితి..

రేగిడి మండలంలోని బొడ్డవలస నాగావళి నదీతీరంలో ఉమ్మడి జిల్లాల్లోని ఏడు మండలాలకు తాగునీటిసరఫరాచేసే ఇన్‌ఫిల్టర్ బావులు ఉన్నాయి.ఇక్కడి నుంచే చీపురుపల్లితోపాటు రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లో పలు మండలాల ప్రజలకు దాహార్తిని తీర్చుతున్న పథకాలకు తాగునీరందుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో ఇసుక దందాను నిలువరించలేకపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం కూడా ఇసుక తరలింపును అడ్డుకోలేకపోతోందని విమర్శలొస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానానికి అనుమతి ఇవ్వడంతో ఇన్‌ఫిల్టర్ బావులకు సమీపంలోనే యంత్రాలతో తవ్వకాలు యథేచ్ఛగా చేస్తుండడం విశేషం. వంతెనలు, ఇన్‌ఫిల్టర్ బావులకు 500 మీటర్ల దూరంలో యంత్రాలతో తవ్వకాలు చేయకూడదన్న నిబంధనలు సైతం బేఖాతర్ చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఇన్‌పిల్టర్ బావులు ఉన్న ప్రాంతం మన్యం జిల్లా పరిధిలో ఉండడంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని రేగిడి మండల అధికారులు చెబుతున్నారు.

కలెక్టర్‌కు నివేదిక..

బొడ్డవలస ఆవలిఒడ్డు ఉన్న ఇన్‌ఫిల్టర్ బావుల సమీపంలో ఇసుక తవ్వకాలు తమ తనిఖీలో వెలుగు చూశాయని తహసీల్దారు చిన్నారావు తెలిపారు.ఇది తమ సరిహద్దుకాకపోవడంతో ఇటీవల తనిఖీ నివేదికలు కలెక్టర్‌కు నివేదించామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి లేదు

సంగమేశ్వరస్వామి ఆలయానికి ఆదాయ వనరులు సమకూరే అవకాశం ఉన్నా అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. ఇక్కడ కనీస వసతులకు నోచుకోని పరిస్థితి నెలకొంది.

● కనీస వసతులకు నోచుకోని వైనం ● ఇదీ సంగమేశ్వరస్వామి ఆలయంలో పరిస్థితి

వంగర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పేరుగాంచిన సంగమేశ్వరస్వామి ఆలయం వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. ఈ ఆలయానికి 42 ఎకరాల భూములు ఉన్నా ఇక్కడ కనీస వసతులు కొరవడ్డాయి. ప్రధానంగా ప్రజాప్రతినిధులు తమ మాటే నెగ్గాలన్న పంతం పుణ్యమాని అభివృద్ధి గాడితప్పింది. ఆలయ అభివృద్ధికోసం దాతలు ముందుకువచ్చినా వారికి గౌరవం లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఆలయానికి సంబంధించి కోట్ల రూపాయలు నగదు, భూములు ఉన్నప్పటికీ వాటిని ఖర్చు చేసేందుకు దేవాదయశాఖ అధికారుల నుంచి అనుమతులు రావడంలేదు. ప్రధానంగా ఆలయానికి రూ.ఎనిమిది లక్షల వరకూ ఆదాయం రావల్సిఉన్నా, రూ.రెండు లక్షలు మాత్రమే చూపిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. దీనికితోడు కార్తీకం, మహాశివరాత్రి, మాఘమాసంలో ప్రసాదాల విక్రయం, టిక్కెట్ల ద్వారా రూ.పది లక్షల వరకూ ఆదాయం వస్తోంది. ఎనిమిది మంది అర్చకులు, ఈవో, అకౌంటెంట్ ఉన్నా కనీస వసతుల కల్పనపై దృష్టిసారించడంలేదని భక్తులు వాపోతున్నారు.

సమస్యల పాగా..

● ప్రధానంగా కనీసం తాగడానికి నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ● కేశఖండన శాలలో నీటి సౌకర్యం లేకపోవడంతో తలనీలాలు సమర్పించిన అనంతరం భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ● ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం వచ్చే నీరు బయటకు వెళ్లే కాలువ దెబ్బతినడంతో నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వెలుడుతోంది. ● మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయట, ఏటి ఒడ్డున మలవిసర్జనకు వెళ్లాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. ● ఆలయం ముందు భాగంలో దీపాలు వెలిగిస్తుండడంతో భక్తులు నడిచేందుకు ఇబ్బందిపడుతున్నారు. అక్కడ నేలపై నూనే పడేసమయంలో భక్తులు జారిప డిపోతున్నారు. మరోచోట దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ● భక్తులకోసం ఏర్పాటుచేసిన రేకులు షెడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో చిన్నపాటి వర్షానికి బురదమయమవుతోంది. ● దైవదర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వాహనాలపై వచ్చే వారికోసం పార్కింగ్ సదుపాయం లేదు.


అధ్వానంగా ఉన్న ఆలయానికి వెళ్లే దారి

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు..

గతంలో టీడీపీ పాలనలో ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని సంగాం ఆలయ కమిటీ ఛైర్మన్ బోను ఆనందరావు తెలిపారు. తర్వాత వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. ప్రస్తుతం రహదారి సమస్యకు పరిష్కారం చూపామని తెలిపారు. త్రివేణి సంగమ ప్రాంతంలో స్నానఘాట్, బట్టలు మార్చుకునేందుకు గదులు నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేశామని చెప్పారు. దేవదాయశాఖ అధికారులతో చర్చించి పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా తాను ఇటీవలే వచ్చానని, ఆలయా ఆస్తులు పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఈవో శ్యామలరావు తెలిపారు.

నేడు ఓటర్ల జాబితా పరిశీలకుడు రాక

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై పరిశీలించేందుకు ఓటర్ల జాబితా జిల్లా పరిశీలకుడు, రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు సోమవారం జిల్లాకు రానున్నారని కలెక్టరు, ఎన్నికలఅధికారి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్, సహాయ అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

19 వరకు పార్శిల్ డెలివరీ స్పెషల్ డ్రైవ్

శృంగవరపుకోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):పార్శిల్ డెలివరీ స్పెషల్‌డ్రైవ్‌ను జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్టీసీఅధికారి అప్పలనారాయణ తెలిపారు. ఈ మేరకు సంబంధించిన కరపత్రాలను ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏటీఎం దివ్య పాల్గొన్నారు.

పీవీ రావుకు నివాళి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల కోసం మాల మహానాడు స్థాపించి ఉద్యమమే ఊపిరిగా ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం పోరాడిన పోరాట యోధుడు పీవీ రావు అని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయనగరంలోని మాల మహానాడు కార్యాలయంలో పీవీ రావు వర్ధంతి పురస్కరించుకుని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నూకరాజు, సత్యనారాయణ, సంతోష్‌కుమార్‌పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు సహకరించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు చేద్దామనుకునే ఉత్సాహవంతులకు కొంత మంది బ్యాంకర్లు సంబంధం లేని ప్రశ్నలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బ్యాంకుల సహకారం కరువైందని తక్షణమే కలుగజేసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.జిల్లాలో పరిస్థితి గుర్తించి, చిన్నపరి శ్రమల ఏర్పాటుకు న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు.

పెట్రోల్ బంకులో తనిఖీ

డెంకాడ,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డెంకాడ సాయిశ్రీనివాస ఏజెన్సీస్ పెట్రోల్ బంక్‌ను జిల్లా పౌర సరఫరాల అధికారి మధు సూదన రావు, సీఎస్‌డీటీలు ఆర్.శంకరరావు, ఎన్‌వీవీ ఎస్ఎన్ మూర్తి, హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ బిగగన్ ఈశ్వర్ ఆదివారం తనిఖీనిర్వ హించారు. పెట్రోల్ కల్తీపై వాహన చోదకుల నిరసన శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో అధికారులు స్పందించారు. ఈమేరకు స్టాక్ రిజిస్టర్ పరిశీలించగా తేడాలు ఉండడంతో పైప్‌లైన్లు పూర్తి స్థాయిలో తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతవరకు బంక్‌లో విక్రయాలు నిలిపివేయాలని కోరారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్‌ని అవమానించడాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాండ్రంకి వెంకటరమణ డిమాండ్ చేశారు. విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం, వెంకటేష్ పాల్గొన్నారు.

గణిత టాలెంట్‌టెస్టు

రేగిడి,డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): చాటాయివలసలో ఆదివారం స్థానిక యూత్ అధ్వర్యంలో గణితదినోత్సవం పురస్కరించుకొని గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. 14 పాఠశాలల నుంచి ఒకటి నుంచి పదోతరగతి వరకు 160 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మంగళపాలెంలో క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభం


వైద్యరాయ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కొత్తవలస, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):క్యాన్సర్ రోగులకు విజయశ్రీ ఉప్పలపాటి క్యాన్సర్ ఆసుపత్రి వరం అని సిక్కిం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.అమరనాథ్ గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని మంగళపాలెంలో అమెరికాకు చెందిన ఉప్పలపాటి ఫౌండేషన్ 15 కోట్ల ఆర్థిక సాయంతో నిర్మించిన క్యాన్సర్ ఆసుపత్రిని, భవన సముదాయాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, ఎస్.కోట, అనకాపల్లి ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, కొణతాల రామకృష్ణ గురుదేవ చారిటబుల్‌ట్రస్టు సేవలను కొనియాడారు.సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి మాట్లాడుతూ గురుదేవ ఛైర్మన్ తాను ఏదైనా చేయాలనుకుంటే అది చేసేవరకూ విశ్రమించరన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ముకుందం శర్మ మాట్లాడుతూ గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలను చూసిన తర్వాత ఒక వ్యక్తి ద్వారా ఇన్ని కార్యక్రమాలను నిర్వహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. గురుదేవ ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, ఉప్పలపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటపతిరాజు మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పారామెడికల్, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్యాధికారి తెన్నేటి సుబ్బారావు రచించిన వైద్యరాయ శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో స్టీల్ ఎక్ఛేంజ్ ఆఫ్ ఇండియా ఎండీ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జీ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.



నౌపడ సత్యనారాయణకు సేవా అవార్డు

ఢిల్లీ ఏపీ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణకు సేవా అవార్డును బహూకరిస్తున్న సమైక్య తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు.
-(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)

యూటీఎఫ్ నాయకుడు వెంకటరావు మృతి


వెంకటరావు (ఫైల్)

రాజాం రూరల్,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని తెలగావీధిలోని తన స్వగృహంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు దేశెట్టి వెంకటరావు (56)ఆదివారం వేకువజామున మృతిచెందారు. వెంకటరావు ఆర్నెల్లుగా మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. రాజాం మండలంలోని పొగిరి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరావు దశాబ్దానికిపైగా యూటీఎఫ్ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. రాజాంతోపాటు శ్రీకాకుళంజిల్లాలోని పలుమండలాల్లో యూనియన్ పటిష్టతకు కృషి చేశారు. వెంకటరావు భార్య షర్మిళ రాజాం మండలంలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు.కాగాఆదివారం తెలగావీధిలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటరావు మృతదేహంపై యూటీఎఫ్ జెండాను కప్పి యూనియన్ నాయకులు రెడ్డి మోహనరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు అంతిమయాత్రలో వందలాది మంది పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

రేగిడి,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండ్యాం హైస్కూల్‌లో 1988-89లో పదోతరగతి చదువుకున్న 22 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. వేర్వేరుప్రాంతాల్లో పలువృత్తుల్లో స్థిరపడిన వారంతా హెచ్ఎం నాగభూషణం దొర ఆధ్వర్యంలో ఒక చోట కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. పాఠశాలలో అప్పట్లో గణితం బోధించిన అంబఖండికు చెందిన ఉపాధ్యాయుడు చక్రపాణిని పూర్వవిద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఖండ్యాంకు చెందిన పూర్వ విద్యార్థి రైల్వేకాంట్రాక్టర్ గురవాన శ్రీను, సీతంపేట ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ నీలంనాయుడు, పూర్వ విద్యార్థులు వి.నారాయణమూర్తి, ధనలక్ష్మి, అచ్యుతరావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలను త్వరగా పూర్తిచేయండి

లక్కవరపుకోట,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):టీడీపీ సభ్యత్వాలను త్వరగా పూర్తిచేయాలని పార్టీ మండలాధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడుపిలుపునిచ్చారు. ఆదివారం గనివాడలో సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 8,886 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. పదివేల సభ్యత్వాలు చేయాలనే ఆలోచనతో పార్టీ పెద్దలుఉన్నారని చెప్పారు. మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావులు బాధ్యత తీసుకోవాలని కోరారు.

250 మద్యం సీసాలు స్వాధీనం

గరివిడి(మెరకముడిదాం), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న 250 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు బుదరాయవలస పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి మెరకముడిదాం మండలంలోని భైటిపురం గ్రామసమీపంలో ఇద్దరు వ్యక్తులు 250 మద్యం సీసాలను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా వారిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తలతంపర రేషన్ డిపో సీజ్

సంతకవిటి,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని తలతంపర రేషన్ డిపోను సీజ్‌చేసినట్లు సీఎస్‌డీటీ ఎస్.చిరంజీవిరావు తెలిపారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ అధికారులు తనిఖీ సమయంలో రేషన్‌పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో స్టాకొకి బయట ఉన్న స్టాక్‌కు తేడా ఉందని పేర్కొని 6ఎ సెక్షన్ కేసు నమోదుచేసి డిపోను సీజ్ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బందికలగకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.1150 బియ్యం కిలోలు, 38 కేజీల పంచదార, 88 కిలోల కంది పప్పు తక్కువగా ఉన్నట్లు తెలిపారు.

టీడీపీలో 25 కుటుంబాల చేరిక


నెల్లిమర్ల: టీడీపీలో చేరిన వారితో బంగార్రాజు, రవిశేఖర్

నెల్లిమర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూతికపేటకు చెందిన 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. నెల్లిమర్లలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆ గ్రామ పార్టీ నాయకులు సుంకర లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ శీల రాములప్పడు ఆధ్వర్యంలో వీరంతా చేరారు. ఈ మేరకు మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ తదితరులు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లాకార్యదర్శి లెంక అప్పలనాయుడు, బయిరెడ్డి కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

జనసేనలోకి 50 కుటుంబాలు..

గజపతినగరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బొండపల్లి మండలంలోని గొల్లుపాలెం, కొండపేటకు చెందిన వైసీపీ నుంచి 50 కుటుంబాలు జనసేనలో చేరాయి.ఆదివారం జనసేన పీఏసీ సభ్యురాలు పడాలఅరుణ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మునకాల జగన్, రాపాకసాయి, తిరుపతిరావు, గంగరాజ్‌శ్రీను, శ్యామలరావు పాల్గొన్నారు.

●బొండపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుపల్లిలో వైసీపీ నుంచి పలువురు జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, పార్టీ మండలాధ్యక్షుడు జగన్నాథరావు సమక్షంలో జనసేనలో చేరారు. బొండపల్లి వైసీపీ జడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు తనయుడు రాపాక సాయి సురేష్‌తోపాటు దేవుపల్లి వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇట్లా తిరుపతిరావు, ఎస్.సింహాచలం, తుంగ గంగరాజు, మలిరెడ్డి శ్యామలరావు, మహదాసు శ్రీను, పల్లంటి గణేష్, గొడ్డు కొసరాజులకు చెందిన 40 కుటుంబాలు జనసేనలో చేరాయి.

వైసీపీకి ఎంపీటీసీ, సర్పంచ్‌ల రాజీనామా

దత్తిరాజేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పలువురు వైసీపీకి సర్పంచ్‌లు,ఎంపీటీసీలు రాజీనామాచేస్తున్నట్లు తెలిపారు. పెద కాదకు చెందిన సర్పంచ్ గుజ్జు మంగమ్మ, అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ నగిరెడ్ల సత్యం,ఉపసర్పంచ్ స్వామిరెడ్డి ఈశ్వరరావు,మరడాం గ్రామానికి చెందిన సర్పంచ్ పోతల రామలక్ష్మి, కోరపు కొత్తవలస సర్పంచ్ యాండ్రాపు వెంకటనాయుడు, వంగరకు చెందిన పలువురు వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు, పప్పల లింగాలవలసకు చెందిననాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.

అఖిల భారత కబడ్డీపోటీలకు శంకరరావు ఎంపిక

నెల్లిమర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామ సచివాలయంలో విద్యా, సంక్షేమ కార్యదర్శి, నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన కాళ్ల శంకరరావు ఢిల్లీలో జనవరి మూడోతేదీ నుంచి జరిగే అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని సత్తాచాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయన సివిల్ సర్వీస్ ఉద్యోగుల జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడం ఇది మూడోసారి.ఈసందర్భంగా శంకరరావును ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి,సర్పంచ్ అట్టాడ శ్రీను, ఎంపీటీసీ పెనుమత్స సంతోష్‌బాబు, ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, కార్యదర్శి మోహనరావు, రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్ బొమ్మన రామారావు అభినందించారు.

శంబలనగరికి సూర్యభగవానుని విగ్రహం తరలింపు

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజీపేట శంబలనగరిలో ఆశ్రమనిర్వాహకులు మరో పంచలోహ విగ్రహం ఏర్పాటుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈమేరకు పంచలోహ సూర్యభగవానుని విగ్రహం ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ఎస్.కోట చేరుకుంది. ఇప్పటికే 1800 కేజీల వేదగాయిత్రీ మాత విగ్రహం ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ మేరకు విగ్రహాన్ని ఉరేగింపుగా ఆశ్రమానికి తరలించారు. ఈసందర్భంగా ఆశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ 144కేజీల విగ్రహంలోఏడుగుర్రాలు ఉన్నాయని, వీటికి ఏడువారాలు పూజలు జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 10న ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. ఉరేగింపులో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామానుజన్ మ్యాస్ట్రీ టెస్ట్‌కు స్పందన


రాజాంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

రాజాం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):రాజాంలోని అబ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన అబ్యాస్ రామానుజన్ మ్యాస్ట్రీ టెస్ట్‌కు స్పందన లభించింది. ఈ మేరకు రాజాం పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లోగల మూడునుంచి తొమ్మిదో తరగతి వరకు 1600మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు అబ్యాస్ విద్యా సంస్థల డైరెక్టర్ బి.రాజేష్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

భూయాజమాన్య హక్కు పత్రాలకు సర్వే: డీపీవో

కొత్తవలస, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 983 రెవెన్యూ గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించి హక్కు పత్రాలను ఇచ్చేందుకు రీసర్వే ప్రాజెక్టు తిరిగి ప్రారంభించామని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) పి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ ఎస్.రమణయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామకంఠం భూముల్లో ఉన్న ఇళ్లస్థలాలకు భూయాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చేందుకు సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు 606 గ్రామాల్లో మ్యాపింగ్ ఇప్పటికే జరిగిందని,127 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని చెప్పారు. రీసర్వే పూర్తయిన వెంటనే ఇంటికి హక్కు పత్రాలను అందజేస్తామని తెలిపారు.ఈకార్యక్రమం గత ప్రభుత్వంలో జరిగినా పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. 777 పంచాయతీల్లో రెగ్యులర్‌గా పారిశుధ్యపనులు జరుగుతున్నాయని చెప్పారు. 934 రక్షిత మంచినీటి పథకాల ట్యాంక్‌లు 15 రోజులకోసారి క్లీనింగ్ చేస్తున్నామని తెలిపారు.

పోరాటాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి

గజపతినగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతో సమస్యలను పరిష్కరించుకోవాలని వ్యవశాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లెశ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం గజపతినగరంలో డప్పు చర్మకారుల సంఘం నాయకుడు తుపాకుల రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు పాలక ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రాము, గోవింద, రాంబాబు, చింతలదేముడు పాల్గొన్నారు.

కుప్పలు తడిచి.. గింజలు మొలకెత్తి

● దెబ్బతిన్న వరి, అపరాల పంటలు ● ఆందోళన చెందుతున్న రైతులు


గజపతినగరం: తుమ్మికాపల్లిలో నీటిలోఉన్నవరి కుప్పలు

జిల్లాలో మూడురోజులుగా బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులకు అపారనష్టం వాటిల్లింది. పలు చోట్ల పంటపొలాల్లో పెట్టిన వరి కుప్పలు పూర్తిగా తడిచిపోవ డంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. మరికొన్నిచోట్ల వరి, అపరాల పంటలు దెబ్బతిన్నాయి. గింజలు తడవడంతో గింజలకు మొలకలు వస్తున్నాయి. అయిదే ఆదివారం వర్షం తెరిపివ్వడంతో పంటను రక్షించుకునే పనిలో రైతులు పడ్డారు.

గజపతినగరం డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదుపాడ, తుమ్మికాపల్లి, శ్రీరంగరాజపురం కాళంరాజపేట తదితర గ్రామాల్లో నీటిలో ఉన్న పంటలను గట్లపై వేసి రైతులు ఆరబెడుతున్నారు. పలు గ్రామాల్లో వరి కంకులకు మొలకలు రావడంతోపాటు గింజలు తడవడంతో ధాన్యం రంగుమారిపోయే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు కోసిన సమయానికి వర్షం కురవడంతో పంట పొలాల్లోని ఆదరాబాదరాగా కుప్పలుపెట్టారు.అయితే కొన్నిచోట్ల కుప్పల్లోకి నీరుచేరడంతో పంటలు పాడయ్యే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

●శృంగవరపుకోట రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.కోసి వదిలేసిన పంట పూర్తిగా తడిచి మొలకలు వచ్చాయని వాపోతున్నారు. తక్షణమే పంటను పరిశీలించి తమను ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

రైతులకు అండగా ఉండాలి


ఎన్నికైన పత్రాన్ని రమణకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సాగునీటి సమస్య పరిష్కరించి రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. ఆదివారం ముంజేరు సమీపంలో ఉన్న ఎమ్మెల్యే స్వగృహంలో డెంకాడ ఆయకట్టు నీటి సంఘ అధ్యక్షులు ఎస్.రమణఆమెను కలిశారు. అలాగే ముంజేరు జనసేన కార్యాలయంలోఎమ్మెల్యే లోకంనాగమాదవికి పూసపాటిరేగ మండలం లోని తిప్పలవలస మత్స్యకారులు కలిశారు. గ్రామానికి చెందిన తొమ్మిది మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లి ఒడిశా తీరంలో కోస్టు గార్డ్ సిబ్బందికి పట్టుబడిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే రాష్ట్రకేంద్రప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లి మత్స్యకారులను విడుదలచేయించారు.ఈమేరకు మత్స్యకారులు ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులతో కలిసి అభినందించారు.

అపరాల పంటకు అపార నష్టం

- నీట మునిగిన పొలాలు
- లబోదిబోమంటున్న రైతులు



గుయ్యానవలసలో పాడైన పంటను చూపిస్తున్న రైతులు



కంచరాంలో తుఫాన్ ప్రభావానికి గురైన పెసర పంట

రాజాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గంలోని అపరాల పంటలకు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు అపారనష్టం వాటిల్లింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అపరాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలోని రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో ఈ ఏడాది రెండు వేల ఎకరాల వరకు సాగుచేశారు. పలు గ్రామాల్లో పెసర, మినప పంటల్లో వర్షం నీరు చేరడంతో కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేశామని, వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు చేరడంతో చేతికి వచ్చిన సమయంలో పాడవుతోందని వాపోతున్నారు. కొన్నిచోట్ల పెసర, మినుము చేనుకు మొక్కలు రావడం రైతులు లబోదిబోమంటున్నారు. తక్షణమే అధికారులు పంటనష్టాలను పరిశీలించి తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. కాగా తుఫాన్ వల్ల పెసర, మినప పంటలు పడయ్యాయని సమాచారం ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంటనష్టాన్ని అంచనాలు వేసి నివేదిస్తామని రాజాం వ్యవసాయశాఖ ఏడీ చంద్రరావు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

తుఫాన్ ప్రభావం పెసర, మినప పంటలపై పడింది. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండపోవడంతో గింజలు మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. వరి పంటలను మాత్రం ముందుగానే కాపాడు కోగలిగాం. పెసర, మినప పంటలను మాత్రం కాపాడు కోలేకపోయం. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకొని పంటల పరిహారాన్ని అంచనా వేయించి రైతులను ఆదుకోవాలి.

- నారాయణరావు, కంచరాం రైతు

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి

చేతికి అందాల్సిన పెసర, మినప పంటలు తుఫాన్ వల్ల గంగపాలయ్యాయి. చివరకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకొని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నషష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించాలి.

- పడాల లక్ష్మణరావు, గుయ్యాన్నవలస రైతు

నగల షాపులో అగ్ని ప్రమాదం



షాపులో మంటలు చెలరేగుతున్న దృశ్యం

పాలకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాలకొండలోని కార్తికేయ జ్యూయలర్ షాపులో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమదంలో షాపులో ఉన్న బంగారం, వెండి, నగదుతో పాటు ఫర్నీచర్, ఏసీలు, సీలింగ్ ఫ్యాన్లు అగ్నికి ఆహుతైనట్టు యజమాని వారణాసి శేఖర్ తెలిపారు. షాపునకు సంబంధించిన నగదు, బిల్లులు షాపులోనే ఉన్నాయని చెప్పారు. ఆదివారం రాత్రి 9.15 గంటల సమయంలో షాపులో నుంచి పొగలు వస్తున్నట్టు స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక శకటానికి సమాచారం ఇచ్చానని, వారు వచ్చి మంటలను అదుపు చేశారని తెలిపారు. షాపులో ఉన్న బంగారం, వెండి నగలతో పాటు ఫర్నీచర్ తదితర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయని అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు తెలిపారు. సుమారు రూ.25లక్షలు విలువ చేసే సీలింగ్, ఫర్నీచర్, వేయింగ్ మిషన్లు, ఏసీలు కాలిబూడిదైనట్టు ప్రాథమికంగా గుర్తించారు. బంగారు, వెండి నగలు వివరాలను ఇన్యూరెన్స్ సిబ్బంది వచ్చి అంచనా వేస్తారని యజమాని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక అధికారులు తెలిపారు. పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి ఘటనా స్థలాన్ని చేరుకుని, వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బొబ్బిలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలం గొలగాం గ్రామానికి చెందిన నడిమివలస రాంబాబు అనే యువకుడు బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి తమ బంధువుల ఇంట్లో ఫంక్షన్ కోసం స్కూటీపై వచ్చాడు. మధ్యాహ్నం భోజనాల అనంతరం తమ బంధువులను బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు స్కూటీపై తీసుకెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి ఇందిరమ్మ కాలనీకి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమపాదం పూర్తిగా నుజ్జయిపోయింది. మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

మల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు మెమో

సీతంపేట రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లకు డీడీ అన్నదొర ఆదివారం మెమోలు జారీ చేశారు. ఉపాధ్యాయుల కొరతపై మల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు శనివారం ఐటీడీఏ వద్ద నిరసన తెలిపారు. అయితే దీనిపై అధికారులు సంబంధిత ప్రిన్సిపాల్‌పై చర్యలకు ఉపక్రమించారు. తరగతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులు ఏవిధంగా బయటకు వచ్చారనే దానిపై వివరణ ఇవ్వాలని కోరుతూ ప్రిన్సిపాల్ ఆర్.వాసుదేవరావు, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబులకు డీడీ అన్నదొర ఆదివారం మెమోలు జారీ చేశారు.

విద్యార్థిని కొట్టిన వ్యక్తిపై కేసు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సుశాంత్ అనే బాలుడిని చితకబాదిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. ఈనెల 13వ తేదీ శుక్రవారం కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న సుశాంత్ తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లి ఉసిరికాయలు ఏరుతున్నాడు. ఆ సమయంలో తోట యజమాని పట్టిక జనార్థన వచ్చి కాయలు ఏరుతున్న విద్యార్థులకు పట్టుకోవడానికి ప్రయత్నించాడు. సుశాంత్ తోట యజమానికి దొరికిపోగా మిగతా విద్యార్థులు పారిపోయారు. జనార్ధన్ సుశాంత్‌కు బితకబాదాడు. ఈ ఘటనపై విద్యార్థులు తల్లిదండ్రులు ఆదివారం ఎల్విన్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


ప్రమాదాల నివారణపై అవగాహన

సీతంపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణపై స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక వారపు సంత సమీపంలో వాహన చోదకులు, ఆటో డ్రైవర్లకు హెల్మెట్ వాడకం, వేగ నియంత్రణ, పరిమితికి మించి ప్రయాణీకులకు ఎక్కుంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

బెల్లం ఊటలు ధ్వంసం

చిన గోరపాడు గ్రామ సమీపంలో పోలీస్‌లు నిర్వహించిన దాడుల్లో 300లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. ఎస్ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఈ ఊటలను గుర్తించి, ధ్వంసం చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎన్టీఆర్‌పై అభిమానం చాటుకున్నారు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పార్వతీపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ ఆవరణ ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఓ యువకుడు నిత్యం శుభ్రం చేసి, పూలమాలలు వేసి తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. స్థానిక పండ్ల షాపు యజమాని పిల్లా శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది చినమరికి గ్రామానికి చెందిన బోడపిండి సత్యనారాయణ.. నిత్యం ఎన్టీఆర్ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాలలు వేస్తున్నారు. నందమూరి అభిమానులు అభినందిస్తున్నారు.

సాగునీటి వనరులను కాపాడుకోవాలి

- రాయగడ కలెక్టర్ పారుల్ పట్వారి



జెండా ఊపి రథాన్ని ప్రారంభిస్తున్న కలక్టర్

ఒడిశా

రాయగడ, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): రైతులు సాగునీటి వనరులను కాపాడుకోవాలని కలెక్టర్ పారుల్ పట్వారి అన్నారు. రాయగడలో ఆదివారం జరిగిన నీటి సంఘాల పంచాయితీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం నీటి వనరులు కాపాడుకోవడానికి రైతులు తీసుకోవ ల సిన జాగ్రత్తలపై అవగాహన రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం 11 పంచాయతీలలో పర్యటించి రైతులను చైతన్యపరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, నీటి సంఘాల సంఘాల సభ్యులు వాటర్ మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్ దూసి, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి డాక్టర్ మెర్సినిధి బాగ్, అదనపు ఎస్పీ బిష్ణుప్రసాద్ పాత్ర, అధికారులు పాల్గొన్నారు. సిల్లిగుడ డ్యాం వద్ద జరిగిన కార్యక్రమంలో రాయగడ శాసనసభ్యుడు అప్పలస్వామి కద్రక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నీటి సంఘాల ప్రతినిధులు సమగ్రమైన ప్రణాళికతో నీటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

- ఎంపీ కలిశెట్టిని కోరిన ఎమ్మెల్యే బేబీనాయన



ఎమ్మెల్యే బేబీనాయన నివాసంలో సమావేశమైన ఎంపీ కలిశెట్టి

బొబ్బిలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలో ఆదివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబీనాయనలు సమావేశమై, పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఆయన్ని కోరారు. బొబ్బిలి రైల్వేస్టేషన్ సమీపంలో ఇంతవరకు కొనసాగిన గూడ్స్ వేగన్ లోడింగ్, అన్‌లోడింగ్ కేంద్రాన్ని ఎత్తివేయకుండా యథాతథంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక కళాసీ సంఘం ఎంపీని కోరింది. దీనికి బేబీనాయన మద్దతు పలికారు. వందేభారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలు దఫాలు మంత్రులకు, రైల్వే అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. నూతనంగా రైల్వేస్టేషన్ నిర్మాణం జరుగుతున్నందున ప్రయాణీకుల కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజల తరఫున బేబీనాయన కోరారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యలన్నిటిపైనా పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎంపీ అప్పలనాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లాడ భాస్కరరావు, రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, గెంబలి శ్రీనివాసరావు, సింగనాపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి పల్లకి సేవ

- ఘనంగా ధనుర్మాస పూజలు



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో గల రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం, కంచరవీధి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, సింగారపువీధి వైభవవేంకటేశ్వర స్వామి, అగ్రహారం వీధి ఆంజనేయ స్వామి, పాతబొబ్బిలి వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాస మహోత్సవాలు చాలా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారి పల్లకీసేవ, గోదాదేవి పూజ, విష్ణుసహస్ర నామ పారాయణం, పాశురాల స్తోత్రం, గోవిందనామ పారాయణం తదితర పూజలు నిర్వహించారు. ● వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దర్శించుకున్నారు.

జనసేన కార్యాలయంలో రక్తదాన శిబిరం

బొబ్బిలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు, అవేర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ పెద్దింటి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మహిళలు ఆర్థిక ప్రగతి సాధించి, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించ డమే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఇఫ్కో రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం లుంబేసు పంచాయతీలో ఇఫ్కో సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో స్వయం సేవక బృందాలతో ఇఫ్కో ప్రాజెక్టు మేనేజర్ అల్లు పోలినాయుడు, డివిజనల్ మేనేజర్ మీనక వసంత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు డైరెక్టర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇఫ్కో వంటి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చేయూతనివ్వడం, ఆర్థిక అభివృద్ధికి దోహదపడడం సంతోషించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 56వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించామని చెప్పారు. ఎమ్మెల్యే జగదీశ్వరి చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో జయరాజ్, టీడీపీ మండల కన్వీనర్ పాడి సుధ, ఎంపీటీసీ మండంగి గౌరమ్మ, సర్పంచ్ సీతమ్మ, ఇఫ్కో మండల ఎగ్జిక్యూటివ్ బిడ్డిక పుష్పనాథం, గురుబిల్లి మండల ఎగ్జిక్యూటివ్ టి.శంకరరావు, పార్వతీపురం మండల ఎగ్జిక్యూటివ్ బి.జనార్థన, నాయకులు కామేశ్వరరావు, జమ్మయ్య, జానకి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

బొబ్బిలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు చాలా గ్రామాల్లో వరి పంటకు విపరీతమైన నష్టం వాటిల్లిందని, అలాంటి వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తడిచిన ధాన్యం విషయంలో రైతులకు వెసులుబాటు కల్పించాలని, తేమ శాతం 30 శాతం వరకు పెంచాలని కోరారు. ఇప్పటికే చాలా మంది రైతులు దళారులకు ధాన్యం అమ్ముకొని ఆర్థికంగా నష్టపోయారన్నారు. మిగిలిన ధాన్యం విషయంలోనైనా ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

నష్ట పరిహారం అందించాలి

రామభద్రపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేమురెడ్డి లక్ష్మంనాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వరినూర్పులు చేయకపోవడం, మడుల్లో నీరు చేరిపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని వ్యవసాయ అధికారులు ధాన్యం కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. తేమ శాతం 30 శాతానికి సవరించాలని, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

పత్తి కొనుగోలు కేంద్రంపై ప్రచారమేదీ?

పాలకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భామినిలో పత్తి కొనుగోలు కేంద్రంపై మార్కెటింగ్ శాఖ కనీసం ప్రచారం చేయడం లేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. భామిని మండలంలో ఈ నెల 23న పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తరుణంలో మండలంలో ఉన్న రైతులు పెద్ద ఎత్తున హాజరై పత్తి కొనుగోలు విధి విధానాలు తెలుసుకోవాలన్నారు. సంఘం జిల్లా ట్రెజరర్ బొత్స గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

గరివిడి, సంతకవిటి, చీపురుపల్లి, కురుపాం, బొబ్బిలి రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పాఠశాలల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: రామాంజనేయ కాలనీ ఉన్నత పాఠశాలలో గణిత చిహ్నాలు, సూత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



కురుపాం: జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



బొబ్బిలి: విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

బొబ్బిలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రాంతంలో క్రిస్మస్ వేడుకల సందడి జోరందుకుంది. స్థానిక సీబీఎం, ఆర్‌సీఎం చర్చిల్లో ఆదివారం మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సీబీఎం చర్చిలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ● బొబ్బిలి రూరల్: అలజంగిలోని సీబీఎం (ఎయిడెడ్) పాఠశాలలో ఆదివారం బాల ఏసు జననం సంబరాలు వనమిత్ర కె.కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: వేడకల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

న్యూస్ బాక్స్

13 గ్రామాల్లో పీసా ఎన్నికలు

సీతంపేట రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం 13 గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన వివరాలను వెల్లడించారు. వలగెడ్డ, కొత్తగూడ, గుమ్మడ, దోనుబాయి, చినకంబ, బిల్లగూడ, కిల్లాడ, జయపురం, గజిలి, దుగ్గి, కుసిమి, వజ్జాయిగూడ, గొయిది గ్రామాల్లో ఈ ఎన్నికలు నిర్వహిస్తారని చెప్పారు.

నేటి గ్రీవెన్స్‌కు జేసీ, ఎమ్మెల్యే.

సీతంపేట రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జేసీ శోభిక, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరు కానున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు జిల్లాకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

పార్వతీపురం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి రానున్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారు. ఈ వేడుకలకు కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు.

బస్సుల ప్రారంభంలో ఎమ్మెల్యే

విశాఖపట్నంలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆదివారం పాల్గొన్నారు. విశాఖపట్నం నుంచి పార్వతీపురం తదితర ప్రాంతాలకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సులను మంత్రి ప్రారంభించారు.

ధ్యానంపై ర్యాలీ

పాలకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా రుషి యోగా కేంద్ర సభ్యుడు ధనుంజయ గురువు ఆధ్వర్యంలో సుమారు 50 మందితో ఆదివారం ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో యోగా, ధ్యానంపై ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు నెల్లి వెంకటరమణ, బొడ్డు రామ్మోహన్, కందుల శ్రీనివాసరావు, లక్ష్మణరావు, వాసు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కొమరాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం చినఖేర్దిల పంచాయతీ సీసాడవలస గ్రామంలో విద్యుత్ వినియోగదారులతో కలిసి విద్యుత్ బిల్లులను దహనం చేస్తూ నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, సీపీఎం నాయకులు కామయ్య, చిలకమ్మ, సుబ్బమ్మ, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం తగ్గాలని..

వీరఘట్టం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నూర్చిన ధాన్యాన్ని ఇంటికి తేవడం వీలు లేక కొంతమంది రైతులు పొలాల్లోనే బస్తాలతో ఉంచారు. ఈ ధాన్యం వర్షానికి తడిచిపోయింది. ఆదివారం ఎండ కాయడంతో బస్తాలలోని ధాన్యాన్ని ఆరవేశారు. తేమ శాతం తగ్గకపోతే ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కిమ్మిలో బ్రిడ్జిపై ఆరవేసిన ధాన్యం